# సామాజిక భవనాల నిర్మాణంలో జాప్యం

## పిల్లర్లకే పరిమితమైన నిర్మాణాలు

**బోరబండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** బోరబండ, రహ్మత్ నగర్ డివిజన్ల పరిధిలో చేపట్టిన సామాజిక భవనాల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పలుచోట్ల అసంపూర్తిగా మిగిలిన భవనాల్లో అసాంఘిక కార్యక్రమాలు కొనసాగుతుండడం వల్ల స్థానికులకు ఇబ్బంది తప్పడం లేదు. బహుళ ప్రయోజనకరంగా ఉండేలా సామాజిక భవనాలు అందుబాటులోకి వస్తాయని భావిస్తే 'ఉన్నది పోయే- ఉంచుకున్నదీ పోయే' అన్నట్లు పరిస్థితి తయారైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### భారత్ నగర్ బస్తీలో..

బోరబండ భారత్ నగర్ బస్తీలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన సామాజికభవనం శిథిలావస్థకు చేరడంతో దానిని నేలమట్టం చేసి నూతన భవన నిర్మాణం చేపట్టారు రూ. 65.35 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన పనులను దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, జీహెచ్ఎంసీ అప్పటి డిప్యూటీ మేయర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్‌తో కలిసి ఆరేళ్ల క్రితం ప్రారంభించారు. ఈ సామాజిక భవనాన్ని కూల్చకముందు అందులో అంగన్ వాడీ కేంద్రం కొనసాగేది. తరచూ ఉచిత వైద్య శిబిరాలు, ఇతర సామాజిక కార్యక్రమాలను నిర్వహించేవారు. ఈ భవనంలో మూడు పోలింగ్ బూత్ లు కూడా ఉండేవి. బాలజ్యోతి పేరిట ప్రత్యేక ప్రాథమిక పాఠశాల కూడా ఈ భవనంలో నిర్వహించారు. బస్తీకి సంబంధించిన వివిధ కార్యక్రమాలను అక్కడే నిర్వహించేవారు. జీ ప్లస్ వన్ పద్ధతిలో కొత్త కమ్యూనిటీ హాల్ నిర్మిస్తే వివిధ కార్యక్రమాల నిర్వహణకు అనువుగా ఉంటుందని భారత్ నగర్ వాసులతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆశించారు. పనులు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా పిల్లర్ల దశనే దాటలేదు.


పిల్లర్లకే పరిమితమైన భారత్ నగర్ సామాజికభవనం

### మధురానగర్ బాధలే వేరు..


అసంపూర్తిగా మిగిలిన మధురానగర్ కమ్యూనిటీ హాల్

రూ.92.70 లక్షల అంచనా వ్యయంతో మధురానగర్‌లో ఐదేళ్ల క్రితం సామాజిక భవనం పనులు ప్రారంభించారు. కింది అంతస్థు, మొదటి అంతస్థుకు పై కప్పు నిర్మించారు. గోడలు, ఇతర పనులను అర్థాంతరంగా వదిలేశారు. ఇక్కడ 28 ఏళ్ల క్రితం కార్డుబోర్డు బ్లాక్‌లతో నిర్మించిన సామాజిక భవనంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కొనసాగేది. వినాయకరావు నగర్ సామాజిక భవనం కూల్చడంతో అక్కడ నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కూడా మధురానగర్ సామాజిక భవనంలోనే నిర్వహించేవారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఏళ్ల తరబడి పూర్తికానందున మధురానగర్‌లోని ప్రభుత్వ పాఠశాల మూతపడడమే కాకుండా అక్కడ నిర్వహించిన వినాయకరావునగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బంజారానగర్ సామాజిక భవనంలో కొనసాగిస్తున్నారు. భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రివేళల్లో అసాంఘిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు.

### ఎస్పీఆర్ హిల్స్‌లో..

రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్ నవీన్ నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పదేళ్లుగా పెండింగ్‌లో ఉంది. బండపల్లి చంద్రమ్మ కార్పొరేటర్ గా ఉన్నప్పుడు నిధులు మంజూరై పనులు మొదలైనప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదు. దీనిని కొందరు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎస్పీఆర్ హిల్స్‌లోని పలుబస్తీల్లో నిర్మించిన సామాజిక భవనాలు చాలాకాలంగా మరమ్మతులకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని పెండింగ్‌లో ఉన్న సామాజిక భవనాల నిర్మాణం పూర్తి చేయడమే కాకుండా మిగతా భవనాలకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

### పెద్దమ్మనగర్ భవనం పెద్దకథ

పెద్దమ్మ నగర్ కమ్యూనిటీహాల్



బోరబండ బలహీన వర్గాల కాలనీ పెద్దమ్మనగర్‌లో చేపట్టిన సామాజిక భవన నిర్మాణ పనులు ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్నాయి. వివిధ కారణాలతో పనుల్లో తీవ్రజాప్యం జరుగుతోంది. రూ.5.38 లక్షల అంచనా వ్యయంతో జీ+1 పద్ధతిలో చేపట్టిన భవన నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేయడంతో కొత్త సమస్యలు తలెత్తుతున్నాయని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయని సామాజిక భవనంలో కాస్త చీకటి పడగానే మద్యం, గంజాయి తాగేవారికి అడ్డాగా మారుతోందని చెబుతున్నారు. ప్రభుత్వ ప్రాథమిక, నాట్కో ప్రభుత్వోన్నత పాఠశాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చేరువలో ఉన్న ఈ సామాజిక భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని, దీనిపై జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన 'సమస్యలపై శంఖారావం' కార్యక్ర మంలోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సామాజిక భవన నిర్మాణం పూర్తయితే బస్తీవాసుల సమావేశాలు, అంగన్‌వాడీ కేంద్రం, గ్రంథాలయం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.


వినతిపత్రం ఇస్తున్న బీసీ కుల సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు

## 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా చేయాలి

**ఖైరతాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పక్కాగా అమలయ్యేలా కోర్టులో స్టేను రాష్ట్ర ప్రభుత్వం వెకేట్ చేయించాలని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. మంగళవారం హైదరాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పీఎస్ చారి, ప్రధాన కార్యదర్శి రమేష్ బలిజ తదితరులు కలెక్టర్ కార్యాలయంలో హైదరాబాద్ ఆర్‌డీవో వెంకటాచారి ద్వారా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కోర్టులో సరైన వాదనలు వినిపించి స్టేను ఎత్తివేసేలా న్యాయ పోరాటం చేయాలని, దీంతో పాటు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాజ్యాంగ సవరణ జరిగేలా చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఐక్యవేదిక హైదరాబాద్ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, ప్రతినిధులు వీరమణి, రేణుక, వెంకట్ ఈశ్వర్ తదితరులు ఉన్నారు.


11కేవీ విద్యుత్ కేబుల్ పనులు చేస్తున్న సిబ్బంది

## 11కేవీ విద్యుత్ కేబుల్ పనులు ప్రారంభం

**ఖైరతాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** ఖైరతాబాద్ పాత కల్లు కాంపౌండ్ నుంచి మారుతీనగర్ మీదుగా రాజ్‌నగర్ వరకు 11 కేవీ విద్యుత్ కేబుల్ అమర్చే పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్థానికుల వినతుల మేరకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ విజయారెడ్డి చొరవతో విద్యుత్ శాఖ రూ.10 లక్షల నిధులతో కూడిన పనులను సైఫాబాద్ డీఈ, ఏడీఈ, ఏఈలతో పాటు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఇందులో భాగంగా ఐదు విద్యుత్ స్తంభాలు, ఎల్‌టీ లైన్లు వేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# చివరి వరకు ప్రజల కోసమే పనిచేసిన మాగంటి

- బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత


యూసుఫ్‌గూడలో ప్రచారం చేస్తున్న మాగంటి సునీత, కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్

**బంజారాహిల్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అనారోగ్యంతో బాధపడుతున్నా చివరి వరకు ప్రజల కోసం పనిచేశారని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె యూసుఫ్‌గూడలో మంగళవారం పాదయాత్ర చేశారు. గడపగడపకూ వెళ్లి ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అందరి సహకారంతో బీఆర్ఎస్ మరోసారి విజయం సాధించడం తథ్యమన్నారు. కేసీఆర్ పది సంవత్సరాల పాలనలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, ఎక్కడకు వెళ్లినా లబ్ధిదారులు ఆదరిస్తున్నారని అన్నారు. కార్యకర్తలు, నాయకులు పార్టీ విజయం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బోరబండ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, స్థానిక కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. మాగంటి గోపీనాథ్ కుమార్తె మాగంటి దిశిర ఎల్లారెడ్డిగూడలో ఇంటింటికీ వెళ్లి స్థానికులను కలిశారు. తన తల్లికి ఎన్నికల్లో మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు.


ఎల్లారెడ్డిగూడలో ఓటు అభ్యర్థిస్తున్న మాగంటి దిశిర

### వెంగళరావునగర్ డివిజన్‌లో..

**వెంగళరావునగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలనే లక్ష్యంతో ఆ పార్టీ శ్రేణులు వెంగళరావునగర్ డివిజన్‌లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మంగళవారం మాజీ మంత్రులు మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, మెతుకు ఆనంద్ బృందాలు, స్థానిక కార్పొరేటర్ దేదీప్యవిజయ్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి డివిజన్ లోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని వారు ప్రజలకు వివరించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి వినూత్నంగా ప్రచారం చేశారు. ఓ సెలూన్‌లో హెయిర్ కట్ చేశారు. ఓ టిఫిన్ సెంటర్‌లో వడ, బజ్జీలు వేశారు.


ఓ టిఫిన్ సెంటర్‌లో వడ వేస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి

## బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు యత్నం

- ప్రతిఘటించిన మహిళ
- పారిపోయిన ఆటోడ్రైవర్

**సైదాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని ఆటో డ్రైవర్ తెంపుకొని పారిపోయేందుకు యత్నించాడు. అప్రమత్తమైన మహిళ ప్రతిఘటించి కేకలు వేయడంతో ఆటో డ్రైవర్ ఆమెను నెట్టివేసి పారిపోయాడు. ఈ ఘటనలో కిందపడ్డ మహిళకు గాయాలయ్యాయి. సైదాబాద్ ఎస్‌బీహెచ్ కాలనీలో మంగళవారం సాయంత్రం చిలువేరి సురేఖ(50) వాకింగ్ చేస్తోంది. కమ్యూనిటీ హాల్ వద్ద ఆటో నడుపుకుంటూ వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి మహిళ మెడలో బంగారు గొలుసును తెంపుకొని పారిపోయేందుకు యత్నించాడు. మహిళ అడ్డుకుని గట్టిగా కేకలు వేసింది. దీంతో నిందితుడు మహిళను నెట్టేసి ఆటోతో పారిపోయాడు. ఈ ఘటనలో కిందపడటంతో మహిళకు గాయాలయ్యాయి. బాధితురాలి కుమారుడు ఫిర్యాదుతో సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు రోజుల క్రితం మహిళ అదృశ్యం..

## మీర్‌పేట్ చెరువులో మృతదేహం లభ్యం

**సరూర్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** మతిస్థిమితం సరిగా లేని ఓ మహిళ రెండు రోజుల క్రితం అదృశ్యమైంది. మంగళవారం చెరువులో మృతదేహమై కనిపించింది. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బడంగ్‌పేట్‌లోని సమతానగర్ కాలనీకి చెందిన ఎం.కమల(52) కొంత కాలంగా మానసిక రుగ్మతలకు చికిత్స పొందుతోంది. ఆదివారం సాయంత్రం ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆమె ఆచూకీ కోసం ప్రయత్నిస్తుండగా మంగళవారం ఉదయం మీర్‌పేట్ మంత్రాలచెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. సదరు మృతదేహం కమలదిగా నిర్ధారించిన పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారమివ్వగా వారు వచ్చి ఆమెను గుర్తించారు. సంఘటనా స్థలం వద్ద శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.


కమల(ఫైల్)

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

**సంతోష్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొదుతూ మృతిచెందాడు. సంతోష్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమన్‌గల్‌కు చెందిన జంగయ్య(60) భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 8న ఉదయం 9.30 గంటల సమయంలో సంతోష్‌నగర్‌లోని బాబానగర్ రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సంతోష్‌నగర్ పోలీసులు 108లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ మేరకు ఎస్ఐ షేక్ వాజీద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సబంధించిన వారు ఎవరైనా ఉంటే ఫోన్ నం.8712661296, 8712549697లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.


జంగయ్య


జిజ్ఞాస స్టూడియోలో కెరీర్ గైడెన్స్ శిక్షణను ప్రారంభిస్తున్న చెల్లప్పా తదితరులు

## కెరీర్ గైడెన్స్ శిక్షణ ప్రారంభం

**అమీర్‌పేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** జయహో జాలాది సేవా సంస్థ అమీర్‌పేటలోని జిజ్ఞాస స్టూడియోతో కలిసి యువతకు, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ శిక్షణ కార్యక్రమాలను మంగళవారం ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ ఎస్.చెల్లప్పా ప్రారంభించారు. అలాగే, మరో విశ్రాంత ఐఏఎస్ దినకర్‌బాబు జయహో జాలాది వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ వెబ్‌సైట్‌లో తమ పేరు నమోదు చేసుకోవడం ద్వారా సంస్థ సేవలను నిరుద్యోగ యువత ఉచితంగా పొందవచ్చని సంస్థ వ్యవస్థాపకులు జాలాది రత్నసుధీర్ తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ట్రైనర్ నందిగాం నవీన్, ఇతర ట్రైనర్లు దిలీప్, తుమ్మలపల్లి రవిచంద్ర, శ్రీనివాస్, మధుయాదవ్, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటడం అద్భుతం : జయేష్‌రంజన్

**అమీర్‌పేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** పర్యావరణ పరిరక్షణ కోసం పూజ్య దాజీ మార్గదర్శకత్వంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్ చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమం అద్భుతమని ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్ అన్నారు. మంగళవారం అమీర్‌పేటలోని హోటల్ మారీగోల్డ్‌లో గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్(జీజీహెచ్ఆర్)-2025 ప్లాంటేషన్ వీక్- ఎ మూవ్‌మెంట్ బియాండ్ మైల్స్ నాలుగో ఎడిషన్‌ను ఆయన ప్రారంభించారు. గత మూడు ఎడిషన్లలో గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ సాధించిన అద్భుతమైన విజయం తర్వాత, ఈ సంవత్సరం రన్ నవంబరు 16న జరగనున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం నవంబరు 9 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించబడుతుందని, దీని లక్ష్యం దేశవ్యాప్తంగా 10వేల మొక్కలు నాటడమని నిర్వాహకులు వెల్లడించారు. అనంతరం మారథాన్‌ను విజేతగా నిలిపిన గ్రాన్యూవల్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి మాట్లాడుతూ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ మునుపటి ఎడిషన్‌ల అసాధారణ ఫలితాలు తమకు మరింత ప్రేరణ ఇచ్చాయని పేర్కొన్నారు.


నిర్వాహకులతో కలిసి గ్రాన్యూల్స్ హార్ట్‌ఫుల్‌నెస్ ప్లకార్డు ఆవిష్కరిస్తున్న జయేష్‌రంజన్

## 480 టన్నుల వ్యర్థాల తరలింపు

**ఖైరతాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** జీహెచ్ఎంసీ సర్కిల్-18 లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ జరుగుతోంది. ప్రతీ వార్డుకు రెండు మినీ టిప్పర్లను కేటాయించి రోడ్లు, ఫుట్‌పాత్‌లతో పాటు పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన మట్టికుప్పలు, ఇతర వ్యర్థాలను తరలిస్తున్నారు. శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా మట్టి, వ్యర్థాలు ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని డంప్ యార్డులకు తరలిస్తున్నారు. అక్టోబరు 4న ప్రారంభమైన ఈ డ్రైవ్ 18వ తేదీ వరకు సాగుతోందని, డ్రైవ్‌లో భాగంగా గడచిన 6 రోజుల్లో 480 టన్నుల వ్యర్థాలను తరలించామని సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య తెలిపారు.



మట్టికుప్పలను తీసుకెళ్తున్న వాహనం

## ప్రభుత్వ పథకాల సమాచారం ఇవ్వండి

**హైదర్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శంషిగూడలోని వార్డు కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో వార్డు కార్యకలాపాల గురించి చర్చించారు. ఉచిత కరెంట్, గ్యాస్‌కు సంబంధించిన పథకాల లబ్ధి కోసం ప్రజలు ఎక్కువగా వస్తున్నారని, కొత్తగా రేషన్ కార్డు వచ్చినవారు కూడా ఉచిత గ్యాస్, కరెంట్ జీరో బిల్లు పథకాన్ని సద్వినియోగం చేసుకోవడానికి వార్డు కార్యాలయానికి వస్తున్నారని సిబ్బంది కార్పొరేటర్‌కు తెలిపారు. కార్యక్రమంలో అనిల్‌రెడ్డి, లింగం, సత్తయ్య, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# టీజీఓ సభ్యత్వం డిసెంబరులోగా పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

**పంజాగుట్ట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీఓ) హైదరాబాద్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం మంగళవారం సాయంత్రం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ రావు, అసోసియేట్ అధ్యక్షుడు శ్యామ్, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, సభ్యులు హాజరయ్యారు. వివిధ అంశాలపై చర్చించి, పలు తీర్మానాలు చేశారు. 2026 క్యాలెండర్, డైరీల ప్రిపరేషన్ పని మొదలు పెట్టాలని, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని డిసెంబరులోగా పూర్తి చేయాలని, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌ను అధికారికంగా స్థాపించేందుకు అవసరమైన చట్టపరమైన ప్రక్రియలను తక్షణం ప్రారంభించాలని, హైదరాబాద్ జిల్లా శాఖకు ఒక గది కేటాయించాల్సిందిగా అధికారులకు అధికారిక వినతి పత్రం పంపించాలని తీర్మానం చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.దీపరెడ్డి, జిల్లా కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ ఖాదర్, అసోసియేట్ అధ్యక్షుడు జి.ఆశన్న, కోశాధికారి ఎం.వి.రమణ, ఉపాధ్యక్షులు డా.ఎస్.సురేందర్, బి.శ్రవణ్‌కుమార్‌గౌడ్, ఎ.రాజేందర్, ఎస్.మంజులరెడ్డి, ఎన్.శ్రీనివాసులు, పి.రాధాకృష్ణ, సంయుక్త కార్యదర్శి డా.కొత్త విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు మహిళలు అదృశ్యం

**యూసుఫ్‌గూడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** కుటుంబ కలహాలతో ఒకరు, ఇంటి నుంచి బయటకు వెళ్లిన మరొక మహిళ అదృశ్యమయ్యారు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన జి.శ్రీను ఈనెల 2న గోవాకు షూటింగ్‌కు వెళ్లాడు. ఈయన భార్య ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పి 11న ఇద్దరు పిల్లలకు రాపిడో బుక్ చేసి అత్తగారింటికి పంపింది. ఇప్పటికీ ఇంటికి రాకపోవడంతో మామ సుబ్బారావు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

### మరో మహిళ..

ఓంనగర్‌కు చెందిన ఎన్.జానకి కుటుంబ కలహాలతో ఈనెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. సోదరుడు సతీష్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## ప్రేమ వద్దన్నందుకు వేధింపులు

**యూసుఫ్‌గూడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):** ప్రేమించుకొని పెళ్లి చేసుకుందామనుకున్నారు. ఒక్కసారిగా అబ్బాయిలో మార్పులు రావడంతో అమ్మాయి యూటర్న్ తీసుకుంది. అప్పటి నుంచి ఆ యువతికి వేధింపులు, బెదిరింపులు మొదలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌కు చెందిన యువతి షేక్ ముబిన్‌తో ప్రేమలో పడింది. పెళ్లి చేసుకుందాం అనుకున్నారు. ముబిన్ ప్రవర్తనలో మార్పు రావడంతో అమ్మాయి యూటర్న్ తీసుకుంది. అప్పటి నుంచి ముబిన్ యువతి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి వేధిస్తున్నాడు. ఈనెల 12న యువతి కుటుంబసభ్యులకు అశ్లీల వీడియోలను పంపించి, పెళ్లి చేసుకో లేదంటే కుటుంబసభ్యులను చంపేస్తానని బెదిరించాడు. భరించలేని యువతి సోదరి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో పురోగతి

**పిల్లర్ల నిర్మాణంపై అధికారుల కసరత్తు.. రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం**

సికింద్రాబాద్, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): ప్యారడైజ్- సుచిత్ర మార్గంలో ఎలివేటెడ్ క్యారిడార్ నిర్మాణ పనులను ముమ్మరం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఒకవైపు ప్యారడైజ్-సుచిత్ర మార్గంలో, మరోవైపు ప్యారడైజ్-శామీర్‌పేట్ మార్గంలో ఎలివేటెడ్ క్యారిడార్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం, దీనికి అవసరమైన రక్షణశాఖ భూములను ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించిన సంగతి విదితమే. దీనిలో భాగంగా బాలంరాయి పంప్‌హౌజ్ నుంచి బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం జంక్షన్ మార్గంలో సెంటర్ పిల్లర్ల నిర్మాణ పనులపై కసరత్తు ప్రారంభించారు. ఇందు కోసం ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. దీనిలో భాగంగా పిల్లర్ల నిర్మాణ పనులు ప్రారంభమై, ముగిసే వరకు బాలంరాయి పంప్‌హౌజ్ - బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు ట్రాఫిక్‌ను ఒక వైపు (వన్‌వే) మాత్రమే అనుమతించాలని నిర్ణయించారు. బాలంరాయి పంప్‌హౌజ్ నుంచి బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు వెళ్లే ట్రాఫిక్‌ను క్లాసిక్ గార్డెన్, తెలంగాణ తల్లి విగ్రహం జంక్షన్ మీదుగా తాడ్‌బండ్ వైపు మళ్లించాలని నిర్ణయించారు. కాగా బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి బాలంరాయి పంప్‌హౌజ్, ప్యారడైజ్ వైపు యథావిధిగా వాహనాలను అనుమతించనున్నారు. ఇదిలా ఉండగా తెలంగాణ తల్లి విగ్రహం నుంచి బాలంరాయి పంప్‌హౌజ్ వైపు ట్రాఫిక్‌ను నిషేధించి, వన్ వేను ప్రవేశ పెట్టనున్నారు. ఈ నేపథ్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం-తెలంగాణ తల్లి విగ్రహం జంక్షన్ మధ్య, తెలంగాణ తల్లి విగ్రహం- బాలంరాయి పంప్‌హౌజ్ మార్గంలో కొత్తగా రోడ్డు నిర్మాణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. కాగా నూతన ట్రాఫిక్ నిబంధనలు, వన్ వే పద్ధతి ఎప్పటినుంచి అమలులోకి తీసుకురానున్నారో ప్రస్తుతానికి స్పష్టత లేదని కంటోన్మెంట్ బోర్డు అధికారులు తెలిపారు.



బాలంరాయి పంప్‌హౌజ్-తాడ్‌బండ్ రోడ్డు



అన్నానగర్ జంక్షన్- బాబూ జగ్జీవన్‌రామ్ చౌరస్తా మధ్య జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు



అన్నానగర్ తెలంగాణ తల్లి విగ్రహం- ప్యారడైజ్ రోడ్డు

## సమస్యల పరిష్కారానికి ముందుంటా : పాండు యాదవ్

బోయినపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పదవీలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుంటానని కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్ అన్నారు. న్యూ బోయినపల్లి బాపూజీనగర్ చౌరస్తాలో తాగునీటి పైప్‌లైన్‌లో లీకేజీ ఏర్పడటంతో వారం రోజులుగా తాగునీరు వృథాగా రోడ్డు పాలవుతోంది. దాంతో రోడ్డు గుండా పారుతున్న నీటితో అక్కడ ఉన్న రోడ్డు కూడా కొట్టుకుపోతుంది. తాగునీరు పక్కనే ఉన్న అపార్టమెంట్‌లోకి వచ్చి చేరుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్ బాపూజీ నగర్ చౌరాస్తాలో నెలకొన్న పరిస్థితులను మంగళవారం పరిశీలించి సమస్యను బోర్డు వాటర్ వర్క్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన పైప్‌లైన్ పనులను పూర్తి చేసి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ రమేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



స్కూలు విద్యార్థులతో మాట్లాడుతున్న డీసీపీ రష్మి పెరుమాళ్

## ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలి

● డీసీపీ రష్మి పెరుమాళ్

అడ్డగుట్ట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలు, ఆన్‌లైన్ లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలని నార్త్‌జోన్ డిసిపి రష్మి పెరుమాళ్ విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా నార్త్‌జోన్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. నార్త్‌జోన్ పరిధిలోని పలు పాఠశాలలు, కాలేజీల్లోని విద్యార్థులకు డీసీపీ అవగాహన కల్పించారు. ఈ మధ్య ఆన్‌లైన్ గేమ్‌లు, ఆన్‌లైన్ లావాదేవీలు, క్రికెట్ బెట్టింగులు, మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీస్ కంట్రోల్ రూం 100 నంబరుకు కాల్ చేసి సమాచారం అందించాలని ఆయన తెలియచేశారు. కార్యక్రమంలో బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణ, గోపాలపురం ఏసీపీ సుబ్బయ్యలతో పాటు పలువురు సీఐలు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అదనపు డీసీపీ అశోక్, ఏసీపీ సుబ్బయ్య

## ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి

● అదనపు డీసీపీ అశోక్

అడ్డగుట్ట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ యాప్‌ల బెట్టింగ్‌లపై ప్రజలు దూరంగా ఉండాలని నార్త్‌జోన్ అదనపు డీసీపీ అశోక్ సూచించారు. మంగళవారం తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్ నిలయం అంబేడ్కర్ నగర్ బస్తీలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ బెట్టింగ్ లావాదేవీలపై అవగాహన బస్తీ సమావేశ కార్యక్రమానికి నార్త్‌జోన్ అదనపు డీసీపీ శంకర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నిత్యం జరుగుతున్న ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్‌లు, మాదక ద్రవ్యాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బస్తీవాసులకు బస్తీలో స్క్రీన్ ప్లే ఏర్పాటు చేసి ఆన్‌లైన్ మోసాలపై బస్తీవాసులకు చూపించారు. ఈ బెట్టింగ్‌ల వల్ల చాలామంది లక్షల్లో నష్టపోతున్నారని సూచించారు. కార్యక్రమంలో గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, అడ్మిన్ ఏరియా సబ్ ఇన్‌స్పెక్టర్ యశోదర్, ఎస్సైలు రామకృష్ణ, కిరణ్ కుమార్, రమ్యలతో పాటు బస్తీ పెద్దలు రౌతు రాజయ్య, చిన్న వీరయ్య, సాంబయ్యలతో పాటు బస్తీవాసులు పాల్గొన్నారు.



పోస్టర్లతో విద్యార్థులు, పోలీసు అధికారులు

## డ్రగ్స్ వినియోగం ఆరోగ్యానికి హానికరం

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యానికి హానికరమే కాక చట్టరీత్యా నేరమని రాంగోపాల్‌పేట్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ) రాజశేఖర్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులోని వెస్లీ డిగ్రీ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు తెలంగాణ స్టేట్ యాంటి నార్కోటిక్స్ బ్యూరో(టీఎస్ఎన్ఏబీ) సహకారంతో మత్తు పదార్థాల వినియోగం, అమ్మకం, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలను ఎవరైనా వినియోగించినా, అమ్ముతున్న వారు చట్టరీత్యా నేరస్తులని, అలాంటి వారి సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీఎస్ఎన్ఏబీ డీఎస్పీ సైదులు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, రాంగోపాల్‌పేట్ ఎసైలు నర్సింగ్ రావు, గంగాధర్, లక్ష్మీనారాయణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో ఇన్‌స్పెక్టర్ రాంచందర్, ఎస్సైలు

## సైబర్ క్రైమ్స్‌పై విద్యార్థులకు అవగాహన

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఏకాగ్రతతో చదువుపై దృష్టిపెట్టి ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ వైఎంసీఏ కాలేజ్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ ఉల్లంఘనలు,సైబర్ క్రైమ్స్, యాంటీ డ్రగ్, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు, టీవీలు చూస్తూ సమయం వృథా చేసుకోకుండా చదువుపై ఏకాగ్రత పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నరేష్, రవి, మహేశ్వరి, సైబర్ క్రైమ్ వారియర్ ఉమెన్ స్టాఫ్ సౌజన్య, సింధు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాహనాల తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సిబ్బంది

## సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై పోలీసుల స్పెషల్ డ్రైవ్

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, రీల్స్ చూస్తూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. మంగళవారం ట్రాఫిక్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తాలో సెల్‌ఫోన్లు వాడుతూ వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. పట్టుబడిన వారి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇలా పట్టుబడిన వారికి వెయ్యి రూపాయల జరిమాన, కౌన్సిలింగ్ అనంతరం కోర్టు ఆదేశాల మేరకు వాహనాలు బాధితులకు అందిస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 50కు పైగా వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.





బౌద్ధనగర్ ఎస్ఎంఆర్ కాంప్లెక్స్ వద్ద రోడ్లపై పడి ఉన్న కేబుల్ వైర్లు

# రోడ్లపై ప్రమాదకరంగా కేబుల్ వైర్లు

బౌద్ధనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లపై కేబుల్ వైర్లు ప్రమాదకరంగా పడి ఉన్నాయి. దీంతో స్థానికులతో పాటు ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్నిరోజుల క్రితం నగరంలో పలుచోట్ల కేబుల్‌వైర్లతో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు మృతి చెందారు. దీంతో విద్యుత్ శాఖాధికారుల ఆదేశాలతో కరెంట్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను కట్‌చేసి రోడ్లపైనే పడవేశారు. నెలరోజుల నుంచి ఈ వైర్లు రోడ్ల మీద పడి ఉండటంతో పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. బౌద్ధనగర్ డివిజన్‌లో ఎస్ఎంఆర్ కాంప్లెక్స్, వారాసిగూడ పోచమ్మ దేవాలయంతో పాటు పలు ప్రాంతాల్లో కేబుల్ వైర్లు ప్రమాదకరంగా పడి ఉన్నాయి. కేబుల్ వైర్లను తొలగించాలని స్థానికులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదుచేసిన ఫలితం లేదని వాపోతున్నారు.



నాభి శిలను(బొడ్రాయి) దర్శించుకుని, ప్రత్యేక పూజలో పాల్గొన్న డాక్టర్ శంకర్ రావు, తదితరులు

## ముగిసిన బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు

తిరుమలగిరి అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బొల్లారం రిసాలబజార్‌లో మూడు రోజులపాటు జరిగిన నాభి శిల(బొడ్రాయి) ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా ముగిశాయి. మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, అలాగే బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి దంపతులు పూజలు చేశారు. ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ శంకర్‌రావు నాభి శిలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. కొందరు మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జరిగిన అన్నదానం కార్యక్రమంలో సుమారు ఐదువేల మంది పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



రేషన్ షాపుల వద్ద పౌరులకు అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

## సంక్షేమ పథకాలపై అవగాహన

తిరుమలగిరి అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని పేదవర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, వాటిని కంటోన్మెంట్ ప్రాంతంలో పౌరులకు అవగాహన కల్పించడానికి నడుం బిగించామని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కిరణ్ కుమార్ ముదిరాజ్ అన్నారు. కేంద్రం పేదవర్గాల కోసం ఐదు కిలోల బియ్యం పంపిణీ చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఒక కిలో మాత్రమే సరఫరా చేస్తుందని పౌరులకు వివరించారు. రేషన్ షాపుల వద్ద ప్రధానమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కూడిన పోస్టర్‌ను అతికించారు. ఈ అవగాహన కార్యక్రమంలో జైనపల్లి శ్రీకాంత్, పింజర్ల ప్రవీణ్, వినోద్, రమేష్, మెట్టు లక్ష్మణ్, హరికేష్, ప్రశాంత్‌లు ఉన్నారు.

# బీసీలు ఐక్యత చాటాలి: లింగంగౌడ్



రాష్ట్ర బంద్‌కు మద్దతు తెలియజేస్తున్న విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న జరిగే తెలంగాణ బంద్‌లో పార్టీలకతీతంగా సమస్త బీసీ శ్రేణులు పాల్గొని తమ ఐక్యతను చాటాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద వివిధ విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు బంద్‌కు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం అందరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలు, వ్యాపార వర్గాలు, అన్ని వర్గాల ప్రజలు సహకరించి బంద్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు బొల్లెపల్లి స్వామిగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, శ్రీనివాస్, సైదులు, రామకృష్ణ, వెంకట్‌గౌడ్, నరేష్‌రాజుయాదవ్, అశ్వన్, అంజనేయులు, సత్యనారాయణ, రవి పాల్గొన్నారు.

### 18న తెలంగాణ బంద్

ఉప్పల్: బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జాక్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 18న నిర్వహించ తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని చిల్కానగర్ డివిజన్ బీసీ జాక్ కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ప్రవేట్ బాంకెట్ హాలులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, రిజర్వేషన్ వ్యతిరేకుల కళ్లు తెరిపించేలా రాష్ట్ర బంద్ కార్యక్రమానికి అఖిలపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాలని వారు కోరారు. అనంతరం మొత్తం 36మంది సభ్యులతో చిల్కానగర్ డివిజన్ బీసీ జేఏసీ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో వెంకటేశ్వర్లు, సత్యరాజ్‌గౌడ్, విద్యాసాగర్, తెలంగాణ సంపత్, జగదీష్, బాలచందర్, నర్సింలు, చంద్రయ్య, కృష్ణనాయక్, హేమంత్ గౌడ్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## స్ట్రీట్ లైట్‌కు మంటలు

తిరుమలగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి గన్‌రాక్ కాలనీలో మంగళవారం రాత్రి ఇంటి నంబర్ -12 వద్ద గల స్ట్రీట్‌లైట్‌కు మంటలు వచ్చాయి. పరిసర ప్రాంతాలకు చెందిన స్థానికులు భయందోళన చెంది బయటకు పరుగులు తీశారు. సమీపంలో ఉన్న ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. దీంతో కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మరమ్మతులు చేసిన తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సమయానికి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఫైర్ సిబ్బందికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో ఉన్న విద్యుత్ స్తంభాలను అధికారులు పరిశీలించాలని కోరుతున్నారు. వర్షా కాలం కాబట్టి విద్యుత్ హెచ్చుతగ్గుల సరఫరాతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు

## రైలులో బాణసంచా తరలిస్తే కఠిన చర్యలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ సందర్భంగా రైళ్లలో బాణసంచా వస్తువులు, పేలుడు పదర్థాలు తీసుకెళితే కఠిన చర్యలు తప్పవని రైల్వే అధికారులు హెచ్చరించారు. అలా తీసుకెళితే భద్రతకు ముప్పు ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు. ఇలాంటి వస్తువులను తరలిస్తే 1989 సెక్షన్ 164 ప్రకారం వెయ్యి రూపాయల జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష ఉంటుందని గుర్తుచేశారు. రైళ్లలో బాణసంచా వస్తువుల్ని తీసుకెళితే తోటి ప్రయాణికులు 139 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.



## అభివృద్ధి పనుల పరిశీలన

మోండా డివిజన్‌లో పరికిబస్తీ, రెజిమెంటల్‌బజార్ ప్రాంతాల్లో జరుగుతున్న సీసీ రోడ్డు, వాటర్ డ్రైన్,మ్యాన్‌హోల్ పనులను మంగళవారం కార్పొరేటర్ కొంతం దీపిక పరిశీలించారు. పనులను త్వరితగతిన,నాణ్యతతో చేపట్టాలని సూచించారు. బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి

## కురుమల సంక్షేమానికి కృషి చేయాలి

సికింద్రాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కురుమ కులస్థుల సంక్షేమానికి పాటుపడాలని అన్నానగర్ శ్రీమల్లికార్జున కురుమ సంఘం నూతన కార్యవర్గానికి రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు చీర సత్యనారాయణ పిలుపునిచ్చారు. అన్నానగర్ శ్రీమల్లికార్జున కురుమ సంఘం సలహాదారు చిన్నం పాండు కురుమ, అధ్యక్షుడు బండారి బాలరాజు, ప్రధాన కార్యదర్శి డి.రంజిత్‌కుమార్‌లు మంగళవారం సత్యనారాయణను కలిశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మల్లెల రాంచందర్, ఉపేందర్, బి.మల్లయ్య, వి.మల్లేష్, బి.స్వామి, మల్లెల రాము, మైత్రి వాసు, గవ్వల పెద్ద మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



పాండును సత్కరిస్తున్న సత్యనారాయణ

## పాఠశాల అభివృద్ధికి సహకారం

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సంవత్సరం పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు సహకారం అందిస్తామని సనాతన్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ నల్లగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(ఓల్డ్) ఆవరణలో జీపీఎస్ డిజిటల్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు ట్రస్టీ సుబ్రహ్మణ్యం తన సతీమణి జ్ఞాపకార్థం దాదాపు లక్ష రూపాయల విలువ గల బూట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో పాటు ప్రతిభా పాటవాలు తమకెంతో నచ్చాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నాబత్తిని శౌరి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలకు ఇలా దాతలు ముందుకు వచ్చి సహకారాన్ని అందించడం ఎంతో గొప్ప విషయమని, వారికి తన హృదయపూర్వక కృజ్ఞతలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జకీరా సుల్తానా, రాధ, శైలజా, రాధిక, సుమలత పాల్గొన్నారు.



విద్యార్థులతో సనాతన్ ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు